## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 09-09-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ కేంద్ర మంత్రివర్గం పలు నూతన రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు ఈరోజు ఆమోదం తెలిపింది.

❖ శ్రీలంకకు భారత్ సహాయం అందించడం భవిష్యత్‌లో కూడా కొనసాగుతుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పునరుద్ఘాటించారు.

❖ బ్రిక్స్ దేశాల ఆర్థిక మంత్రులు, కేంద్ర బ్యాంకు గవర్నర్ల సమావేశం ముంబైలో ప్రారంభమైంది.

❖ ప్రపంచ నంబర్ వన్ షీతల్ దేవి వరల్డ్ ఆర్చరీ పారా సిరీస్ స్టేజ్-3 పోటీల్లో స్వర్ణ పతకం సాధించింది.

======================

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని 17 జిల్లాల మీదుగా వెళ్ళే ఐదు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 10 వేల 021 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులను 2029-30 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని రైల్వే శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈరోజు సమావేశమయ్యింది. ఆ కేబినెట్ వివరాలను అశ్వినీ వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడిస్తూ... ఈ నాలుగు దక్షిణాది రాష్ట్రాల పరిధిలో చేపట్టనున్న 5 మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులలో అరక్కోణం-రేణిగుంట సెక్షన్‌లో 77 కిలోమీటర్ల పొడవుతో 3, 4 వరుసల నిర్మాణం చేపట్టానున్నామని, వీటిని మూడేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. అలాగే, ఘట్‌కేసర్-కాజీపేట మధ్య నాలుగో వరుస నిర్మాణానికి కూడా ఆమోదం లభించిందని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. అదే విధంగా 10 వేల 700 కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో మూడు మల్టీట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కూడా కేంద్రమంత్రివర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు. ఈ ప్రాజెక్టులు పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని 14 జిల్లాల మీదుగా వెళ్తాయని తెలిపారు. వీటి ద్వారా భారతీయ రైల్వే ప్రస్తుత నెట్‌వర్క్‌కు సుమారు 656 కిలోమీటర్ల మేర అదనపు వరుసలు చేరుతాయని కేంద్ర మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీలంకలో పర్యటిస్తున్న భారత రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కొలంబోలో ఈరోజు ఆ దేశ అధ్యక్షులు అనుర కుమార దిసనాయకేతో సమావేశమయ్యారు. ఇరుదేశాల మధ్య భాగస్వామ్యానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. శ్రీలంక వైమానిక దళానికి చెందిన L70 గన్స్ ఆధునికీకరణతో పాటు.. రెండు దేశాల NCC, నేషనల్ డిఫెన్స్ కాలేజీల మధ్య సహకారం కోసం ఒప్పందాలను కూడా కుదుర్చుకున్నారు. అలాగే భారత రక్షణ దళాలు నిర్మించిన మూడు బెయిలీ బ్రిడ్జిలను ఇరువురు వర్చువల్ గా ప్రారంభించారు. శ్రీలంక భూభాగాన్ని భారతదేశ భద్రతా ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఎలాంటి కార్యకలాపాలకు వినియోగించబోమని శ్రీలంక అధ్యక్షులు దిసనాయకే స్పష్టం చేశారు. దిత్వా తుఫాను సమయంలో “ఆపరేషన్ సాగర్ బంధు” ద్వారా భారత్ అందించిన సహాయానికి, పునర్నిర్మాణ ప్యాకేజీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. శ్రీలంకకు సహాయం అందించడం భారత్ బాధ్యతగా భావిస్తుందని, భవిష్యత్‌లో కూడా ఇది కొనసాగుతుందని రాజ్‌నాథ్ సింగ్ పునరుద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా.. ఆయన జన్మదినమైన ఈనెల 17వ తేదీ నుంచి నెల రోజుల పాటు ‘సేవా సంకల్ప్ అభియాన్’ నిర్వహించనున్నట్లు భారతీయ జనతా పార్టీ ప్రకటించింది. న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ మాట్లాడుతూ... 2001 అక్టోబర్ 7న నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో ఆయన ప్రజా సేవా ప్రయాణం ప్రారంభమైందని వివరించారు. అప్పటి నుండి ప్రజా సేవ నుంచి జాతీయ సేవ అనే మంత్రంతో ప్రధానమంత్రి తన సేవా ప్రయాణాన్ని నిరంతరం కొనసాగిస్తున్నారని చెప్పారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశ పురోగతి కేవలం అభివృద్ధికే పరిమితం కాలేదని, దేశ సాంస్కృతిక గుర్తింపు, వారసత్వం కూడా మరింత బలోపేతమయ్యాయని నితిన్ నబీన్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

9వ జాతీయ పోషణ మాసోత్సవాన్ని కేంద్ర మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఉత్తరప్రదేశ్‌లోని వారాణాసిలో ఈరోజు ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తో కలిసి కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... 9వ జాతీయ పోషణ మాసం ద్వారా సుపోషిత, సశక్త భారత్‌ను నిర్మించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఈ ప్రచార కార్యక్రమం తల్లీ బిడ్డల పోషకాహారం ప్రతి కుటుంబం సౌభాగ్యంతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. సమతుల్యమైన పోషకాహారం ఆరోగ్యకరమైన, సుసంపన్నమైన దేశానికి బలమైన పునాది అని కేంద్రమంత్రి అన్నపూర్ణాదేవి స్పష్టం చేస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014 నుంచి పేదలు, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారాన్ని అందించడంపై ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

బ్రిక్స్ దేశాధి నేతల శిఖరాగ్ర సమావేశానికి ముందు తుది బ్రిక్స్ ఆర్థిక మంత్రులు, కేంద్ర బ్యాంకు గవర్నర్ల సమావేశం ఈరోజు ముంబైలో ప్రారంభమైంది. ఈ ఏడాది బ్రిక్స్ ఫైనాన్స్ ట్రాక్‌కు "స్థితిస్థాపకత, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే ఇతివృత్తం మార్గదర్శకంగా ఉంది. జైపూర్‌లో ఆర్థిక మంత్రులు, కేంద్ర బ్యాంకు గవర్నర్లు గత నెలలో సమావేశమయ్యారు. ముంబైలో జరగనున్న తుది సమావేశానికి ముందు.. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బ్రిక్స్ ఫైనాన్స్ ట్రాక్‌లో సాధించిన కీలక ఫలితాలను సమీక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించి కొత్త నిబంధనలు - 2026ను కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. ఈ నిబంధనలు ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం... సర్క్యులర్ ఎకానమీ, విస్తరించిన ఉత్పత్తిదారు బాధ్యత సూత్రాలకు నిబంధనల్లో ప్రాధాన్యత ఇచ్చారు. వ్యర్థాలను ఉత్పత్తి చేసే ప్రదేశంలోనే నాలుగు వర్గాలుగా వేరు చేయడం తప్పనిసరి చేశారు. వ్యర్థాల సరైన విభజన, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

అహ్మదాబాద్‌లో జరిగిన వరల్డ్ ఆర్చరీ పారా సిరీస్ స్టేజ్-3 పోటీలను భారత్ రెండు స్వర్ణాలు, నాలుగు కాంస్య పతకాలతో ఘనంగా ముగించింది. చివరి రోజైన ఈరోజు పారాలింపిక్స్ ఛాంపియన్ హర్విందర్ సింగ్, ప్రపంచ నంబర్ వన్ షీతల్ దేవి భారత జట్టుకు స్వర్ణ పతకాలు అందించారు. ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ షీతల్ దేవి మహిళల పారా కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో కజకిస్థాన్‌కు చెందిన ఐజాదా సీదాన్‌తో జరిగిన ఉత్కంఠభరితమైన షూట్-ఆఫ్‌లో విజయం సాధించి స్వర్ణ పతకం గెలుచుకున్నారు. మరోవైపు, రెండుసార్లు పారాలింపిక్స్ పతక విజేత హర్విందర్ సింగ్, భావనతో కలిసి పారా రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు, కొండచరియల విరిగిపడటంతో గల్లంతైన వారి గుర్తింపు ప్రక్రియలో భారత ఫోరెన్సిక్ బృందం గణనీయమైన పురోగతి సాధించింది. కాఠ్‌మాండులోని భారత ఫోరెన్సిక్ బృందం ఇప్పటివరకు 1,400కు పైగా డీఎన్ఏ నమూనాలను పరిశీలించగా, 378 డీఎన్ఏ ప్రొఫైళ్లను రూపొందించినట్లు విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. భారత్‌కు చెందిన సంయుక్త సాంకేతిక బృందం ఈరోజు చిలిమేలోని సొరంగంలో నీటిని తొలగించడం, బురదను బయటకు తీసే పనులను కొనసాగించింది. సొరంగం వాలు, పరిమిత ప్రవేశమార్గం కారణంగా పనుల్లో సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ.. బృందం వినూత్న పద్ధతులను ఉపయోగిస్తూ సహాయక చర్యలను కొనసాగిస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =